# సిరిగల తల్లి

దేవుడేం చేయదలిచేడోగానీ, మిస్ అరుణకుమారికి ప్రపంచంలోని దుఃఖంగానీ, కష్టాలుగానీ బొత్తిగా తెలీవు. ఆ పిల్ల తండ్రి జస్టిస్ నిరంజనరావుగారు. కేవలం హోదాతోనే గాకుండా డబ్బువల్లనూ 'పెద్దవాడనే'ది దానికి ముఖ్య కారణం! ఆ యింట్లో ముగ్గురన్నల తర్వాత ఆ పిల్ల ఒక్కగా నొక్క ఆడపిల్ల, అందునా తల్లి లేనిది. ప్రస్తుతం అరుణ వయస్సు పదిహేడు.

జస్టిస్‌గారికి తరుచూ జరిగే బదిలీలవల్ల అరుణమ్మ ఒకే వూళ్ళో కుదురుగా చదువుకున్నది గాదు. డాడీకి బదిలీ వొచ్చిన ప్రతి తడవా అక్కడా ఊళ్ళో బంగళా మార్చి మరో ఊళ్ళో కొత్త బంగళాలో కాలుంచవలసి వొచ్చేది. డాడీకి అరుణమ్మ ఆరోప్రాణం కావడంవలన ఆయనీ పుత్తడిబొమ్మని వెంటేసుకు తిరిగేవారు. ఆయనగారి విధవప్పని ఈ బంగారు బొమ్మ పెంపకం నిమిత్తం నియమించేరు గూడాను.

అన్నయ్యల పరిస్థితి యిలా కాదు. మగవాళ్ళు కనక వాళ్ళంతా ఏదో ఒకే ఊళ్ళో హాస్టల్లో మకాంపెట్టి చదువు ముగించి ఘనమైన ఉద్యోగులై, పెళ్ళిళ్ళు చేసుకున్న ఇంటి వాళ్లై తలో ఊళ్ళోనూ స్థిరపడిపోయేరు.

అరుణమ్మ చదువు ఎక్కువగా ఇంటిదగ్గిరే చదువుకుంది. ఆరో యేటనుంచే ఆ పిల్ల యింగ్లీషు ధారాళంగా మాట్లాడ్డం నేర్చుకుంది. కొత్త చదువు దొరసానులు చెప్పేరు. ఎక్కువగా ప్రత్యేకంగా డాడీనే చెప్పేరు.

ఈ పదిహేడు వసంతాల్లోనూ అరుణమ్మ ప్రపంచం మొహం పనిగట్టుకు చూళ్ళేదు. ఆ అమ్మాయికి తెలిసిన ప్రపంచం బహు చిన్నది. ఆ ప్రపంచంలో డాడీ ముఖ్యుడు. తర్వాత ఆంటీ, ఆ తర్వాత అన్నయ్యలూ, వొదినలూ. కొందరు బంట్రోతులూ, అందమైన కార్లూ, కుక్కలూ—విలువైన బంగళాలూ సాయంత్రాలూను. ఇంతకి వెయ్యిరెట్లు ప్రపంచం బయట జీవిస్తోందని పాపమీ అరుణమ్మకి బొత్తిగా తెలీదు.

జస్టిస్ కోర్టు కెళ్లేముందు, కోర్టునుంచి వచ్చిన వెంటనే అరుణమ్మని దగ్గిరికి తీసుకునేవారు. కళ్ళల్లో యింత ఆనందంతోపాటు వెలుతుర్ని నింపుకుని ‘నా తల్లి క్షేమంగా వుంది నా తల్లి బొమ్మలా అందంగా వుంటుంది. నా తల్లి అమృతాన్ని తాగిన అప్సరస. నా తల్లి నాకోవరం” అనుకునేవారు.

జస్టిస్ కోర్టులో వున్నప్పుడు, ఇంటిదగ్గిర ఆంటీకళ్ళల్లో

పొత్తులు పెట్టుకుని అరుణమ్మని చూచుకునేది. ఇంటిదగ్గిర తిరిగే బంట్రోతులూ వగైరా వాళ్లు, వాళ్ళ కష్టగాథలుచెప్పుకునే సమయంలో ఆ పిల్లని చివరిగదిలోవుంచి వొచ్చి ఆజవాభాని కూకలు వేసేది ఆంటీ!

ఆంటీకిగూడా ఒక కథవుంది. అది విడ్డూరమైన కథ. పరిశీలించిచూస్తే కష్టాల కథ. ఆంటీ జీవితంలో బాగా చితికిపోయిన మనిషి చిన్నతనంలోనే కన్నవాళ్ళు ఆంటీకి పెళ్ళిచేశారు, కట్టుకున్నవాడు యేదో మాయదారి రోగంతో రెండేళ్ళ వ్యవధిలో కన్నుమూసేడు. అప్పట్నుంచీ ఆంటీ అత్తవారింట్లో ఊడిగానికి నిలిచిపోయింది. వాళ్ళదగ్గిం లభించే అనాదరణకి కడుపునిండా తినేసి కన్నీరు పెట్టుకునే ఈ పాడు జాతకానికి పదిహేడేళ్ళక్రితం అందమైన మలుపు దొరికింది. ఈ నిరంజనరావుగారే స్వయంగావచ్చి ఆంటీని కోరేరు – "నా తల్లికి తల్లి లేదక్కా! వొచ్చెయ్" అని పదిహేడేళ్ళక్రితం అంటే తన తమ్ముడింటికి వొచ్చి చేరింది. ఇక్కడున్న సుఖాలని రుచి చూచింది. అరుణమ్మని గుండెలకు హత్తుకుని, పాత కష్ట కథకి వీడ్కోలిస్తూ అనుకునేది – "అమ్మడూ! నువ్వు నా పాలిట దేవతవి. ఈ పాపిష్టి చేతులకి నీ మూలంగా ఒక అలంకారం లభించింది. ఈ దిక్కుమాలిన జన్మకి నీవల్ల స్వర్గందొరికింది. ఇప్పుడు చెప్పమ్మడూ, నాదిగదూ అదృష్టం!"

అరుణమ్మని ఆంటి చేతుల్లో ఉంచినప్పుడు జస్టిస్ ఒక గొప్ప నిజాన్నిగూడా హెచ్చరించేడు.

"అక్కా యిది నాకూతురు, నాప్రాణం, నాలక్ష్మి,

నా సౌభాగ్యం నాకు అన్నని. ఈ పాపకి తల్లి లేదు. "తల్లిలా పెంచే చల్లని చేతికోసం నేను కొన్నాళ్ళు వెదికి నిన్ను ఎంచుకున్నాను. తల్లి ప్రేమ నెలాగూ నువ్వందించలేవు. మాటకి అడ్డు రావద్దక్కా! నన్ను చెప్పనివ్వు. మనసున్న ఆడదానివిగానైనా నాతల్లిని పెంచు. ప్రేమించు. కళ్ళు తెరవని ఈ పసికూన రేపు కళ్ళు తెరిచినప్పుడు మనిషికి జరిగే అన్యాయాలుగానీ, మనిషిపొందే దుఃఖం. బాధలుగానీ చూడకూడదు. ఈ పాప కన్నీరు పెట్టుకుండకి వీల్లేదు. ఈపాప నిత్యం నవ్వడం నేర్చుకోవాలి. డబ్బెంతైనా ఫర్లేదు. నేనిస్తాను. నువ్వు ప్రేమనివ్వు. పాపకి సుఖాన్నివ్వు. నేరాలూ, నేరస్థులు_చట్టాలూ, శిక్షలూ వీటితో నాతల బొప్పి కడుతోందక్కా. కొన్నేళ్ళకి నేనీ వలనుంచి బయట పడతాను. స్వతంత్రుడ్నవుతాను. అప్పుడు నాతల్లిలో నేను నిండుతనాన్ని, నిర్మలత్వాన్ని, పరవళ్ళుతొక్కే ఆనందాన్ని చూడాలి. అంచేతనే దీన్ని నీ చేతుల్లో వుంచుతున్నాను. మన్నించు _ పెద్దదానివనే గౌరవాన్ని సైతం మరిచి మిలట్రీ మనిషిలా కటువుగా మాటాడేనేమో. అయినాసరే, ఈ మల్లెపూవుని మల్లెపూవులాగానే నాకందించు. ఇది నా ప్రార్థన. ఆజ్ఞ."

అందుచేత ఈతి బాధలు చెప్పుకునే పెద్దలుగానీ, బీద మొహాల్తో వొచ్చే బంట్రోతులుగానీ అరుణమ్మ మొదటనిలిచే వారుకాదు. ఆ యింట్లో ఒకానొక విడ్డూరమైన ఆడపిల్ల అతి గారాబంగా పెరుగుతోందనే సత్యం జస్టిస్‌గారి నెరిగిన ప్రతి వాళ్ళకీ తెలుసు.

అరుణమ్మని అలా పెంచేయడం అన్యాయమని అన్నలు అనుకున్నారే తప్ప తండ్రితో అనలేకపోయేరు. ఈ రకమైన పెంపకం వల్ల జరిగే కీడు అరుణమ్మకే జరుగుతుందని వాళ్ళు భావించేరే తప్ప తండ్రి దగ్గిర నోరెత్తలేకపోయేవారు. అక్క శికీ ఆంటీతో, ధైర్యంచేసి ఆ ప్రస్తావన తెచ్చినప్పుడు_ఆంటీ భయపడి వాళ్ళ నోళ్ళని మూసింది.

“కొంప తీయకం డబ్బాయిలూ! మీ హితోపదేశాలు నాకు చెప్పకండి. ఈ ఉపదేశాలతో నా మెదడు పాడుచేయకండి. ఎన్నో ఏళ్ళ తర్వాత నేనిప్పుడిప్పుడే సుఖపడుతున్నాను. వెళ్ళిపోండి నాయనలూ, మీకు చేతులెత్తి నమస్కారం చేస్తాను. నా బతుక్కి ఉచ్చులు పట్టాకండి బాబూ! మీకు వెయ్యిదండాలు” అని ఖచ్చితంగా వాళ్ళందర్తో చెప్పింది.

అన్న వొదినలూ, యితర ఆత్మబంధువులంతా అరుణమ్మకి తలలొగ్గి మాట్లాడేవారు. ఏం మాట తేడా వొస్తే యే కొంప మునుగుతుందోనని భయపడి అతి జాగ్రత్తగానూ మాట్లాడేవారు.

“వొదినలూ! ఆరూ మూడూ తొమ్మిదిగదూ!” అని అరుణమ్మ అడిగిందే తడవు “అవునమ్మా అవునని” జాయింటుగా వొదినలంతా తల లూపేవారు. “అన్నయ్యలూ, మీరుత్త పిరికిదద్దమ్మలు కదూ” అని అన్నల్నడిగితే “అవు నవును చెల్లీ! అది మా ఖర్మ” అనేవారు.

అంత గారాబంగా పెరిగింది అరుణమ్మ.

ఆ రోజు మెట్రిక్యులేషన్ పరీక్షా ఫలితాలొచ్చాయి. అరుణమ్మ పరీక్ష ప్యాసయింది. అరుణమ్మ పరీక్ష ప్యాసైన సందర్భంగా జస్టిస్‌గారు క్లబ్బులో కొందరాత్మీయులకి పార్టీనిచ్చేరు. ఆ పార్టీలో వారు యిలా సెలవిచ్చారు—

"నా కల నిజమయ్యే రోజు దగ్గిరపడింది ఫ్రెండ్స్! నా తల్లి పరీక్ష పాసైంది. నా వెలుగు యెప్పుడూ యెక్కడా ఫెయిలవదు. అలా అని నేనీ రోజు మీ ముందు రాసిస్తాను. నేను రిటైరవబోతున్నాను. ఇన్నేళ్ళుగా నేను నా ఉద్యోగానికి బానిసనై పోయేను. ఇక నా క్కావలిసినంత విశ్రాంతి. నా కన్నతల్లితో నా క్కావలిసినంత కాలక్షేపం. బైది వే_మీ యెరికలో మంచి సంబంధముంటే చెప్పండి. నాలుగేళ్ళ తర్వాత నాకు అల్లుడు కావాలి. ఇప్పట్నుంచే మీరు వేట ప్రారంభించాలి. ముఖ్యంగా_ఆ రాబోయే అల్లుడు మాతోపాటు మా దగ్గిరే వుండిపోవాలి. అదంతే. అతనికి డబ్బుండక్కర్లేదు. నా దగ్గిర బోల్డుంది. అతను ఐ. ఏ. యస్. కానక్కర్లేదు. మనిషి విలువ తెలుసుకునే అర్హతుంటే చాలు. అతని కులం యేదైనా ఫర్లేదు. మంచితనం కావాలి. అన్నిటికంటే ముఖ్యం అతను ఆడదాన్ని గౌరవించే మనిషై వుండాలి. ఇవి చాలు. ఈ గుణాలున్న మానవుడెవడైనా సరే, మీ కంటపడితే వొదిలెట్టకండి. ఒక్క నాలుగేళ్లు పెంచండి, అతని సుగుణాలకి అందమైన రంగులు వేయండి. ఆ దరిమిలా నా కతన్ని చూపించండి."

*           *           *

నన్ను "అరుణ అని చాలామంది అంటారు. డాడీ— నన్ను "తల్లీ" అని "అమ్మా" అని కూడా పిలుస్తారు. ఆంటీ నేమో "అమ్మడూ" అంటుంది.

డాడీ రిటైరైన తర్వాత నేను డాడీ ఆంటీలతో పాటు యీ వూరొచ్చేసేను. ఇక్కడ మాకో యిల్లుంది. డాడీ ముచ్చటకొద్దీ యీ యిల్లు కట్టుకున్నట్టు ఆయనే చెబుతాడు. మే మిక్కడికి రాక ముందు నుంచీ యీ యింట్లో పెద్దన్నయ్యా, పెద్ద వొదినా వుంటున్నారు. మే మొచ్చిం తర్వాత వాళ్ళిక్కడ్నుంచి వెళ్ళిపోదా మనుకున్నారుగానీ, డాడీ అందుకు వొప్పుకోలేదు. అందుచేత వాళ్లు ఈ ఇల్లొదిలి వెళ్ళిపోనూ లేదు. ఇక్కడి వూళ్ళోనే పెద్దన్నయ్య పలుకుబడి గల పెద్ద డాక్టరు.

నేనీవూరు కాలేజీలో పి. యు. సి. లో చేరేను. మా కాలేజీగురించి నేను కొంత చెప్పక తప్పదు.

మొట్టమొదటి రోజు, డాడీ నాతోపాటు మాకారులో వొచ్చి నన్నిక్కడదించి వెళ్ళిప్పుడు ఈ ప్రదేశమంతా నాకు చిత్రంగా కనిపించింది. ఆవరణలో కళ్ళు చెదిరే రంగు రంగుల సీతాకోక చిలకల్లా ఈనాడు ఆడపిల్లలు తిరగడంలో నాకెంతో ఆనందం కలిగింది. భూమ్మీద యెవరో దేవుడు ముచ్చటకొద్దీ రంగు కుంచెని విదిలించినప్పుడు రంగుకొక బొమ్మగా తయారైనట్టున్నారు వాళ్లు (మా కాలేజీలో మగ పిల్లలు లేరు) మా క్లాసులో మొత్తం నలభై మందిమి కలిసి చదువుకుంటున్నాం. వాళ్ళంతా నాతో చనువుగా,

స్నేహంగా మాట్లాడేరు. మొదటిరోజునే మేమంతా ఆత్మీయులమై పోయేం.

సాయంత్రం సరిగ్గా అయిదుగంటలకి డాడీ కారు తీసుకొచ్చేరు. నేను నా నేస్తాల్ని డాడీకి పేరు పేరునా పరిచయం చేసేను. నేను వెళ్ళేదార్లోనే పార్వతి యిల్లుట. పార్వతి పొడవుగావుండి, గాలి కెగిరిపోయే మనిషిలావున్నా–ఆ రెండుజడలూ పార్వతికి అందంగాఉంటాయి. పార్వతిని నా కారులో కూర్చోవలసిందిగా కోరడంవల్ల, అదిచాలా సిగ్గుతో కారెక్కింది.

పార్వతిని వాళ్ళింటిదగ్గిరదించి మేము వెడుతూండగా డాడీ అడిగేరు—

"కాలేజీ ఎలా ఉందమ్మా?"

చాలా బాగుంది డాడీ!"

"ఏం పాఠాలు చెప్పేరు?"

నాకు నవ్వొచ్చేసింది. పాఠాలమీద డాడీకి అంత తొందరేమిటో...

"నవ్వుతున్నావే తల్లీ."

"లేకపోతే పాఠాలేమిటి డాడీ. ఇవాళంతా పరిచయాలే."

"అవుతే నేనో పాఠం చెప్పనా."

"పాఠమా? చెప్పండి డాడీ."

"చూడమ్మా. ఇవాళ మొదటి రోజు గనక పార్వతిని కార్లో ఎక్కించుకున్నావు. తప్పులేదు. కానీతల్లీ, రేపట్నుంచి ఆపిల్ల నీకారే కావాలనే చొరవని నువ్వు ఇవ్వకు."

"అదేం డాడీ."

"ఇదో పాఠం తల్లీ !"

డాడీ పాఠం నా కప్పుడు అర్థం కాలేదు.

—రోజూ, డాడీ కారులో నాతోపాటు కాలేజీకి వొచ్చేవారు. మళ్ళాసాయంత్రంవొచ్చి కారులోనే ఇంటికితీసుకొచ్చేవారు. రానురాను డాడీమీద నాకు విసుక్కలగడం ప్రారంభమయ్యింది. ఓ రోజున నోరు జారేను గూడా.

"చూడండి డాడీ! మీరిలా నిత్యం నన్ను కాలేజీలో విడిచి, మళ్ళీ సాయంత్రం యింటికి తీసుకెళ్ళడం ఏం బాగో లేదు. నే నేమైనా పసిపాపనా? పైగా — కారెలాగో నా కూడా వుండనే వుంటుంది. డ్రైవరూ వుంటాడు."

డాడీ యేమనుకున్నారోగాని వెంటనే జవాబు చెప్ప లేదు. అందుచేత నేనే మళ్ళా మాట కలగ జేసుకున్నాను.

"సారీ డాడీ! నే నేమైనా పొరపాటు మాటాడేనా."

"లేదమ్మా, నీ పొరపాటేం లేదు. అవునుగానీ, నేనిలా వొచ్చిపోవడం బాగోలేదని యెవరైనా నీతో అన్నారా."

"లేదే."

"నా కొక్కడికీ యింట్లో తోచదుగదా. అంచేత మరి ...పోనీలే. రేపట్నుంచి నేను రాను. ఒకే."

"ఒకే డాడీ."

డాడీ నా కోసం ఏమైనా చేయగలరు.

ఇక్కడే — ఒక సాయంత్రం గురించి గూడా చెబుతాను.

ఆ రోజు లాస్టవరు క్లాసు కొంచెం లేటుగా వొదిలేరు.

అది చీకటిపడేవేళ కాదుగానీ, ఆకాశాన్నంతా మబ్బులాక్రమించడంవల్ల వెలుగు తక్కువయింది. ఈదురుగాలితో పాటు వర్షం తుప్పరూ ప్రారంభమయ్యాయి. ఆ రోజు కారు కూడా ఆలస్యంగా వొచ్చింది. గబగబా కారు దగ్గిరికి నడిచేను.

డ్రైవరు కారు తలుపు తెరిచి నించుని అన్నాడు.

"వేగిరం ఎక్కండమ్మా."

కార్లో కూచున్న తర్వాత జ్ఞాపకం వొచ్చింది. పాపం, నా వెనకాతలే వొస్తూన్న పార్వతి ఈ వర్షంలో ఇంటికి నడిచి వెళ్ళడం కష్టమవుతుందని. అప్పటికే మా కారు వేగం అందుకుని తూనీగలా పోతోంది. ఎన్నడూ లేనంత వేగంగా కారుని యింటికి చేర్చేడు డ్రైవరు.

కారు దిగి యింట్లోకి అడుగుపెట్టేను. ఆంటీ ఎదురుగా వొచ్చి అన్నది—

"ఒచ్చేవా అమ్మడూ! తొరగా వెళ్ళు. మీ నాన్న గదిలో వున్నాడు."

ఆంటీ మాటలో "విడ్డూరం" వినిపించింది,

నేను డాడీ గదిలోకి అడుగుపెట్టి అక్కడి దృశ్యాన్ని చూచీ చూడటంతోనే స్తంభించిపోయేను. డాడీ ఆ పెద్ద మంచాన్ని పూర్తిగా ఆక్రమించుకుని వెల్లకిలా పడుకుని ఉన్నారు. పెద్దన్నయ్య స్టెతస్కోపుతో డాడీ గుండెని పరీక్షిస్తున్నాడు. పెద్దన్నయ్య మొహంలో ఆందోళన స్పష్టంగా కనుపిస్తోంది. పెద్దొదిన డాడీ కాళ్ళ దగ్గిరగా నిలబడి వున్నది.

నా కెందుకో భయం వేసింది.

నేనెప్పుడూ భయపడ్లేదు. భయంగురించి నాకసలేం తెలీదు. డాడీని ఆ పరిస్థితిలో నేనింతకుముందు చూళ్ళేదు. కనీసం ఊహించనైనా లేదు.

"నాన్నకి ఆరోగ్యం సరిగ్గాలేదు. దగ్గిరికివెళ్ళు" అన్నది ఆంటీ.

నేను మెల్లిగా అడుగులు లెక్కపెట్టుకుంటూ డాడీ మంచం దగ్గిరికి వెళ్ళేను. అన్నయ్య స్టెతస్కోపు తీసుకుంటూ డాడీతో అన్నాడు.

"అరుణొచ్చింది నాన్నా! అరుణొచ్చింది."

ఈ అరుణ డాడీ జబ్బుకి సరైన మందని డాక్టరన్నయ్యకి తెలుసుకాబోలు! క్షణంలో కళ్ళు తెరిచేరు డాడీ నన్ను చూచి చిన్నగా నవ్వేరు. ఆ పెదాలమీద అంతందమైన నవ్వు కళ్ళనుంచి తొణికిన రెండు కన్నీటి బొట్లతో మాయమైపోయింది.

"డాడీ యేడుస్తున్నారా? డాడీ మీరు లేవకండి! ఎందుకేడుస్తారు? మీరు లేవకూడదు. నేనొచ్చేసేను డాడీ. మీకేం ఫర్లేదు. నో డాడీ. దటీజ్ బేడ్! వెరీబేడ్. ఇందాకటి మీ నవ్వు నాక్కావాలి డాడీ! ఏదీ నవ్వండి."

నన్ను యింకాస్త దగ్గిరగా రమ్మన్నట్టు ఆయన కళ్ళతో సైగచేసేరు. వెళ్ళి ఆయనకి కుడిపక్కన నిలబడ్డాను. ఆయన నా చేతులు రెండూ పుచ్చుకుని కళ్ళమీదకి తెచ్చుకున్నారు. డాడీ కన్నీరు వేడిగా నా చేతుల్ని తాకడంతో నేను ఉలిక్కిపడి ఆయన మొహంలోకి తిన్నగా చూసేను.

డాడీ మెల్లిగా గొణిగినా నా కది స్పష్టంగా వినిపిం చింది.

"నా జ్యోతొచ్చింది. నా ప్రాణమొచ్చింది. నాకేం భయంలేదు. మీరంతా వెళ్ళిపోండి దూరంగా. నాతల్లి చల్లని చేతి స్పర్శతో నేను మళ్ళీ బ్రతికేను. ఒకే డాక్టరూ! నాకు రెస్టు కావాలిరా! ఐవాంట్ రెస్ట్. నా జబ్బుమీద నీ ప్రయోగాలు వేస్టు. వేస్టు. వేస్టు. వెళ్ళిపో..."

ఆ సాయంత్రమే అర్థరాత్రిగా మారినప్పుడు డాడీ మగతగా నిద్రపోయేరు. అన్నయ్య నన్నివతలకి పిలిచి అన్నాడు.

"నువ్వెళ్ళి పడుకో. ఇంక ఆయన కొచ్చిన భయం లేదు."

బలవంతాన నన్నవతలకి పంపేశా డన్నయ్య. పక్క మీద పడుం వాల్చేనేగాని డాడీగురించిన ఆలోచనలు దూరం కాలేదు.

తెల్లవారుతూండగా కాబోలు, డాడీ గదిలోంచి ఆంటీ. యేడుపు వినపడింది. దిగ్గున లేచి డాడీ దగ్గిరికి వెళ్ళేను. ఆ గదిలో అన్నయ్యా, వొదినా, ఆంటీలే కాకుండా మరి కొందరు పెద్దలున్నారు. వాళ్ళంతా గుమ్మంమీద నించున్న నన్ను ఒకేసారి చూసేరు.

ఆంటీ నన్ను ఆమె గుండెలకు జరిగి అదుముకుంటూ అన్నది.

"అమ్మడూ! అన్యాయమై పోయిందేతల్లీ. నా తమ్ముడు ఇక లేడు. మీ నాన్న..."

ఆంటీ చెబుతూన్న "చావు" గురించి కూడా నాకు తెలీదు. డాడీ చచ్చిపోయేరా? వీళ్ళకెవళ్ళకీ బుద్ధుల్లేవు. డాడీ చావడమా? నాన్‌సెన్స్—చూడండి ఆయనెంత ప్రశాంతంగా నిద్రపోతున్నారో? దేవుడికెక్కడయినా చావుంటుందా అసలు? దేవుడు చావడు ఆంటీ. నువ్వు పిచ్చిదానివి.

డాడీ దగ్గిరిగా వెళ్ళి నించున్నప్పుడు నావెనక ఆంటీతో పాటు పెద్దొదిన కూడా రెడీగా వున్నది. వాళ్ళిద్దరి మొహాల్ని చూచి, మెల్లిగా డాడీ పెదాలమీద నా చుబుకాన్ని వుంచేను.

పూర్ డాడీ! నన్ను ముద్దాడలేదు. డాడీ!

* * *

హార్టు ఎటాక్స్ అనగా అకస్మాత్తుగా గుండె ఆగిపోడాలు కొందరి గొప్పవాళ్ళకొచ్చే అందమైన జబ్బు. ఆ జబ్బుచేతనే జస్టిస్ నిరంజనరావుగారు పోయేరని అందరూ వొప్పుకున్నారు. ఆ పెద్దమనిషి పోయి రెండునెలలు గడిచినా, ఆ దిక్కుమాలిన వ్యాధిగురించి డాక్టరు వాణిప్రసాదు, యింటికొచ్చే పెద్దమనుషులందర్తోనూ గంటల తరబడి ఉపన్యసించడమనేది అరుణమ్మకి నచ్చింది కాదు.

అరుణమ్మకి—డాడీ లేడనే భయంకరమైన నిజం ముందు హార్ట్ ఎటాక్స్ అనే మాయదారి వ్యాధి ఒక లెఖ్ఖలోనిది కాదు.

అన్నయ్యకి పిచ్చెత్తింది. నిజంగా, అన్నయ్య పిచ్చాడై పోతున్నాడు. లేకపోతే యెందుకీ ఉపన్యాసాలు? ఎవర్ని ఉద్ధరించను? డాడీ లేకుగా. ఈ ఉపన్యాసాల్తో డాడీ తిరిగి

రారుగా, తనని పెంచిన డాడీని మరిచిపోయి, తనని ఓడించిన వ్యాధిని గుర్తుపెట్టుకుంటాడేం అన్నయ్య? అనుకొనేది అరుణ.

ఆ సాయంత్రం యింటికొచ్చిన పార్వతితో చాలా సేపు మాట్లాడి, రేపుదయం కాలేజీకి వొస్తున్నట్టు చెప్పి పంపింది. ఆ రాత్రి పడుకునేముందు ఆంటీ యేడుపు విని పించగా, లేచి ఆంటీదగ్గిరికి వెళ్ళింది అరుణమ్మ.

"ఆంటీ యేడవకు. నీకేం జరగలేదుగా. డాడీ పోయే రంతే. మనమంతా క్షేమమేగా. మరెందు కేడుస్తావ్ ఆంటీ. ఏడవకు."

ఆంటీ కళ్ళు తుడుచికుని అరుణమ్మని చూచి అన్నది—

"అవునమ్మడూ! నే నేడవ ని క. నువ్వు నిద్రపోనే లేదా? నిద్రపో. నే నేడవనని చెప్పెగా, ధర్మరాజులాంటి తమ్ముడ్ని మింగి బతుకుతూన్న దెయ్యాన్ని. నాకెందు కేడుపు. నే నేనడవనమ్మడూ. వెళ్ళి పడుకో."

"ఆంటీ డాడీని మరిచిపోలేదు. నేను డాడీని మరవ లేను. పెద్దన్నయ్య హార్టు ఎటాక్స్, పెద్దవొదిన ఆ సిపంప కాల్ని, చిన్నన్నయ్యలూ, వొదినలూ, ఈర్ష్యల్ని ద్వేషాల్ని మరిచిపోలేరు. ఈ యింటికేదో ప్రమాదమొచ్చి పడింది. ఈ యింటిని శనేదో ఆవహించింది. ఇక్కడ మనుషులకి సుఖం ఉండదింక. ఇక్కడ జరిగే విపరీతాలకి అంతుండదు. డాడీలేరు డాడీ తిరిగిరారు" అరుణమ్మ పాఠాన్ని చదువుకుని నిద్ర కొరి గింది.

స్నానంచేసి ఆంటీతెచ్చిన కాఫీతాగి పుస్తకాలు సర్దుకుంటుండగా వాణీప్రసాదంవొచ్చి అడిగేడు.

"కాలేజికి వెడుతున్నావా?"

"అవునన్నయ్యా!"

"ఇవాళే వెళ్ళాలా?"

"అవును."

"ఇవాళే చిన్నన్నయ్యా వొస్తున్నాడు."

"ఒస్తే."

"మనం చాలా విషయాలు మాటాడాలి."

"ఏం విషయాలు?"

"ఆంటీ చెప్పలేదా?"

"అవునవును చెప్పింది. డాడీ విల్లు సంగతేకదూ. విన్నాను."

"ఇవాళ మనమంతాకలిసి ఆ పంపకా లెలా జరగాలో ఆలోచించాలి. మధ్యాహ్నం పెద్దమనుషులుగూడా వస్తున్నారు. నువ్వుచూస్తే చిన్నదానివి. నీకేం తెలీదు. మేమేదైనా చెబితే వినిపించుకోవు."

"ఏమిటన్నయ్యా ఈ గొడవ? మీరంతా ఆలోచించి మీయిష్టమొచ్చినట్టు చేయండి. నేను కాదనను. సరేనా?"

వాణీ ప్రసాదం మాటాడలేదుగానీ, వొదినగారు అందుకున్నారు.

"చేయండి చేయండి. అన్ని యేర్పాట్లూ మీరు పూర్తిచేసి వుంచితే రాణీగారు యస్సంటారు. అవతల మీ తమ్ముళ్ళు రాణీగారికి చదువు వొద్దన్నసంగతి చెప్పేరా?"

"అలాగా వొదినా? నాకీసంగతి తెలీదు. కానీ, వొదినా యెవరెన్ని చెప్పదలచుకున్నా నేను చదవడం మానను."

"మరేనమ్మా! నువ్వెందుకు మానతావు. అల్లారు ముద్దుగా పెరిగిన బిడ్డవాయె నీకు వొకళ్లు చెప్పేపాటి వారా?"

వాణీ ప్రసాదం అందుకున్నాడు.

"నువ్వు నోరుమూసుకుందూ! ఒకేటుపోటి ఆల్ రైట్. కాలేజీకి టైమయింది కాబోలు నువ్వెళ్లు అరుణా!"

కాలేజి రోడ్డుమీద కారు వెడుతున్నప్పుడు, అరుణకి మొట్టమొదటిరోజు డాడీ కారులో వొచ్చినవిషయం గుర్తొచ్చి మనస్సు చివుక్కుమంది. కాలేజిగేటుదగ్గిర కారుదిగింది అరుణ. డ్రైవరు వినయంగా చెప్పేడు.

"సాయంత్రం కారు రాదండమ్మా!"

"అదేమిటి?"

"సాయంత్రం పెద్దొదినగారికి క్లబ్బులో మీటింగుందట."

"అందుకు, అన్నయ్య కారుందిగా."

"ఇవాళ బంధువులొస్తున్నారుగా. ఆ కారు వాళ్ళకి కావాలిట."

"సర్లే. నువ్వెళ్ళిపో" అనగలిగింది అరుణ.

నేను చదవడం వొదినకిష్టంలేదు. నేను చదవడం డాడీ కిష్టం నేను చదవడం నా కిష్టం. డాడీ యిష్టాన్ని, నా

యిష్టాన్ని వొదినఖాంకి ·ంది డాడీలేరా. డాడీ తిరిగిరాను” అనుకున్నది అరుణ.

ఆ రోజంతా గజిబిజిగా, గందరగోళంగా వున్నది. ఒక్క పాఠమూ అర్థం కాలేదు. ఆ సాయంత్రం తనతో పాటు నడుస్తున్న అరుణని చూచి పార్వతి ఆశ్చర్యపోయింది.

పార్వతి యింట్లోకి వెళ్ళబోతూ అరుణని ఆహ్వానించింది. అరుణ తొలిసారిగా పార్వతి ఇంట్లో అడుగపెట్టింది.

అది చిన్న డాబాయిల్లు. అతి సాధారణమైన యిల్లది. లోపలికి అడుగుపెట్టిన అరుణని చూచి ఆవిడెవరో వింతగా చూసేరు ఆవిడ చేతుల్లో అందమైన బుజ్జిపాపాయి వున్నాడు. వాడూ, ముచ్చటగా బోసినోరు యింత చేసి అరుణవేపు చూస్తున్నాడు పార్వతి పరిచయం చేసింది.

“నా పెద్దొదిన. వాడేమొ నా మేల్లుడు. నా క్లాసుమేటు అరుణ నీకు చెబితినే జడ్జిగారమ్మాయి.”

“అవునవును కూర్చో అరుణా ... కూర్చో”

ఆ వొదినగారి పేరేమిటోగాని అన్నపూర్ణమ్మవుతే బావుణ్ణు అనుకుంది అరుణ. ఆవిడపేరు అన్నపూర్ణమ్మని తెలిసి ఆనందించింది కూడా.

బుజ్జిగాడ్ని ఎత్తుకుంది. వెధవ, తన చెవలకున్న రింగుల్ని పట్టుకులాగి బాధ పెట్టేసేడు. అయితేనేం, ముద్దొస్తున్నాడు రబ్బరు బొమ్మలా! అన్నపూర్ణమ్మ కాఫీ చేసి తీసుకొచ్చింది. ఆ కాఫీలో అమృతమే కలిసింది కాబోలు, అరుణమ్మకది రుచిగా ఉన్నది.

అరుణమ్మకు అక్కడ్నుంచి కదలాలని లేదు. బయట చీకటి వొచ్చేసింది. అయినా, అరుణకి వెళ్ళిపోవాలని లేదు. ఆవేళకి పార్వతి పెద్దన్నయ్యా, చిన్నన్నయ్యా వొచ్చేరు. వాళ్ళని పరిచయం చేసింది పార్వతి.

పెద్దన్నయ్యకి ఎల్లైసీలోనూ చిన్నన్నయ్యకి స్టేట్ బ్యాంక్‌లోనూ ఉద్యోగాలట. పెద్దన్నయ్య ఎక్కువసేపు మాట్లాడలేదుగాని, చిన్నన్నయ్య అరుణతో చాలాసేపు కొత్తదనం లేకుండా ఎంతో చనువుగా మాట్లాడేడు.

“ఎంతదృష్టంనీది పార్వతీ! పూర్వజన్మలో నువ్వు పుణ్యం చేసుకున్నావు. ఇద్దరన్నలూ నీకు రెండు కళ్ళు! సాక్షాత్తు అన్నపూర్ణమ్మ నీ వొదిన. అదృష్టం నీది పార్వతి!

“ఒస్తానండి. చాలా వేళయిపోయింది” అన్నది అరుణ లేచినుంచుని.

“ఇంత చీకటిలో మీరొక్కరూ ఏం వెడతారుగానీ, నేనూ మా చెల్లి మిమ్మల్ని మీ యింటి వరకూ దిగబెడతాం రండి” అన్నాడు చిన్నన్నయ్య. అతనిపేరు శేషగిరిట.

దార్లోనూ అతనెంతో హాయిగా మాట్లాడేడు. అరుణ వాళ్ళని యింట్లోకి రావలసిందిగా కోరిందిగాని వాళ్ళు రాలేదు. వాళ్ళు వెళ్ళింతర్వాత అరుణ గుమ్మంలో అడుగు పెట్టింది. సరిగ్గా అక్కడే నించుంది - ఆ రోజే వొచ్చిన చిన్నొదిన.

పలకరింపుగా అరుణ దరహాసం చేసింది. దానికావిడ మొట్టమొదటి ప్రశ్న—

“ఆ అబ్బాయి ఎవరు అరుణా?”

"శేషగిరని మా క్లాస్ మేట్ చిన్నన్నయ్య. ఇక్కడే స్టేట్ బ్యాంకులో పన్చేస్తున్నాడు."

"అలాగా. మంచిది. సాయింత్రమనగా కాలేజీ వొదిలితే నువ్విప్పుడా రావటం. ఇవతల మేమెంత బెంగపడిపోయేమో వూహించేవా? కాలేజీకి ఫోన్ చేస్తే యివాళ ఫంక్షన్లుగానీ, మరే విశేషాలుగానీ లేవని చెప్పేడు యెవడో గుమాస్తా. మంచిదరుణా! నేనేమో మీ అన్నలకి అక్కడికీ చెప్పిచూసేను, అరుణేం చంటిపిల్ల కాదు. మీ రనవసరంగా ఖంగారు పడకండీని. వాళ్ళేమైనా వినిపించుకుంటేనా? వెళ్ళమ్మా వెళ్లు. వెళ్ళి వాళ్ళని పరామర్శించు."

అరుణ తలూంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

*　　*　　*

[ఆపేసేరేం కథా? రాయండి ఆదివిష్ణుగారూ! రాయండి. ఏమిటి సందేహిస్తున్నారు! ఓహో... అర్థమైంది లెండి. నా కథలో థ్రిల్సుగానీ, ట్విస్టులుగానీ, గ్లామరుగానీ ముఖ్యంగా సోషల్ పర్పస్ గానీ లేవని బెంగెట్టుకున్నారా? ఇంకేం రచయితలండి మీరు? ఇంత కథా రాసి యీ కథలో యేవో కొన్ని "బలుబులు" లేవని చెప్పి యెవడైనా కథని మధ్యలో ఆపేస్తారండీ? ఫర్లేదు. రాసేయండి. అంతవసరమైతే మీ ఫ్రండ్సందరికీ నేనే సంజాయిషీ చెప్పుకుంటాను. వాళ్ళు మీ పీకట్టుకోకుండా నేను చూస్తాను. సరేనా? ఏమిటి?... రాయలేరా... ఆల్ రైట్ సార్. మీ రాయడానికిష్టం లేకపోయినంత మాత్రాన నా కథ ఆగిపోతుందా

యేం? ఇంతకుముందు చెప్పుకున్నట్టు నా కథని నేనే చెప్పుకుంటాను. కానీసార్! మీలాంటి పిరికి వాళ్ళని క్షమించను — అరుణ]

ఓనాడు మా యింట్లో నా గురించి పెద్ద చర్చ యేర్పాటు చేసేరు అన్నయ్యలూ, వొదినలూను. ఆచర్చలో కొన్ని నిర్ణయాలు గబగబా చేసేరు. నా చదువు యింతటితో ఆపి, యింట్లో కూచోడం మొదటి నిర్ణయం. వాళ్ళంతా కలిసి వొక మనిషిని యెన్నిక చేసినప్పుడు, నేను తలొంచి ఆ యువకుడ్ని పెళ్ళాడడం రెండో నిర్ణయం. ఇతరత్రా నిర్ణయాలు చాలా చేసేరుగాని, ముఖ్యంగా నాకీ రెండు నిర్ణయాలే నచ్చలేదు. నేనదే మాట చెప్పినప్పుడు వొదినలు తమ కోపాన్ని ప్రకటించేరు

పెద్దన్నయ్య సోఫాలో సర్దుకూర్చుని, కళ్ళజోడు మొహం మీంచి తొలిగించి మరీ అన్నాడు.

“చూడరుణా! నీ మొండితనం మా కెవరికీ నచ్చడం లేదు. పెద్దవాళ్ళం మేము చెప్పింది నువ్వినిపించుకోవడం మంచిది. అవసరం కూడాను. ఎన్నో ఆలోచించిగాని మేమేదీ మాట్లాడం. వింటున్నావా?”

“వింటున్నాను అన్నయ్యా! నువ్వు చెప్పదలుచుకున్నదంతా చెప్పు.”

“చూసేరా, చూసేరా ఆ వెటకారం పెద్దా చిన్నా లేకుండా. అమ్మాతల్లీ! మేమంతా గూడా మా తల్లిదండ్రుల దగ్గిర నీకంటే గారాబంగా పెరిగేమేగాని నీలా యిలా తల

బిరుసు సమాధానాలివ్వడం నేర్చుకోలేదు. ఎంతో ముద్దూ ముచ్చటగా పెరిగేం: అణుకువగా మెలిగేం" అన్నది పెద్దొదిన.

నాకు చిర్రకోపమొచ్చిన మాట నిజమేగాని ఆ కోపాన్ని దిగమింగి చెప్పేను—

"ఒదినా క్షమించు. నేను విసురుగా మాట్లాడినా చెప్పదలుచుకున్న దొకటే. నేనింకా చదువుతాను. నేనింతలో పెళ్ళిచేసుకోను"

"ఎందుకుచేసుకుంటావ్? వాడెవడో దిక్కుమాలిన శేషగిరి నీకు నీడలా తిరుగుతున్నాడుగా" అన్నది చిన్నొదిన.

ఈ తడవ నా కోపాన్ని ఆపుకోలేకపోయాను.

"మాటమీరకు వొదినా! నువ్వు ఎవర్తో మాటాడుతున్నావో మరిచిపోవద్దు. నాకివతల ఒక ప్రిస్టైజ్ వుంది. నేనో జిల్లాన్యాయాధికారి కూతుర్ని,"

"అరుణా!" చిన్నన్నయ్య బిగ్గరగా అన్నాను.

"అరవకన్నయ్యా! మీరంతా చేరి నా మనసు పాడు చేస్తున్నారు. డాడీ లేనే ధీమాకొద్దీ నన్ను అల్లరిచేస్తున్నారు. మీరంతా నామీద పగబట్టి సాధించాలని చూస్తున్నారు. ఇది మీకు ధర్మంకాదు. మాటాడకండి నాతో."

నేనక్కడ్నుంచి వేగంగా వెళ్ళిపోయేను. నా గదిలోకి వెళ్ళిమనసు తేలికపడేంతవరకూ యేడ్చేసి సొమ్మసిల్లిపోయేను. నా భుజంమీద ఎవరిదో చల్లనిచేయి తగిలింది. అది డాడీ చేతిలా తోచింది. ఉలిక్కిపడి లేచి చూసేను.

అంటీ ఏడుస్తోంది.

ఆంటీని లతలా పెనవేసుకున్నాను. ఆంటీ నా తలనిమిరింది

"అమ్మడూ నీకేం ఫర్లేదు. పైన దేవుడున్నాడు. నీకెవరూ అన్యాయం చేయలేరు."

—ఆదివారం ఉదయం నేను కాఫీ తాగుతూన్న వేళ శేషగిరి మాయింటికొచ్చేడు. గుమ్మందగ్గిరే అతను నుంచుండిపోయేడు. చిన్నొదిన అత్నిఅటకాయించి, కొంచెం హెచ్చు స్థాయిలో మాటాడటం మొదలు పెట్టింది.

"చూడు శేషగిరిబాబూ! నువ్విలా యిళ్ళకి రావడం మానుకోడానికి యెంత పుచ్చుకుంటావో ఖచ్చితంగా చెప్పు. అంతా అక్షరాలా ముట్టచెప్పడమే గాకుండా కోటిదండాలు కూడా సమర్పించుకుంటాం. మర్యాదగా బతుకున్నతు మనుషులం. మమ్మల్నెందుకు రచ్చకీడుస్తావ్ చెప్పు?"

నేనక్కడికి రివ్వున వొచ్చి చేరేను.

"వొదిన మాటలకేంగాని, మీరు రండి శేషగిరిగారూ! నాగదిలో కూచుందాం రండి."

అతను నా వెనకాతల సిగ్గుగానూ, కొంచెం భయంగానూ వొచ్చేడు. మేమిద్దరం గదిలో కూచున్న తర్వాత వొదిన గొణుక్కోవడం స్పష్టంగా వినిపిస్తూనేవుంది. శేషగిరి తలదించు కూర్చునే వున్నాడు. నేనే మాట్లాడాను.

"మీ బుజ్జి ఎలా వున్నాడండీ."

అతను అర్థరహితంగా తలూపడంతో నేను కొంచెం బాధపడ్డాను

"మీరేం అనుకోకండి శేషగిరిగారూ! ఈ యింట్లో ఎవరేమి అనుకున్నా నేను బాధపడను. మీరూ బాధపడొద్దు. చెప్పండి విషయాలు."

అతను గొంతు తడుపుకొని అన్నాడు.

"నాకు నచ్చిన మీతో రోజుకో తడవైనా మాటాడాలని వుంటుంది. మిమ్మల్ని చూస్తూ కూచోవాలని వుంటుంది. ఏక్షణాన మీరు నాకు పరిచయమయ్యారోగాని, నే నీ కోరికను చంపుకోలేకపోతున్నాను. అది నా సాధ్యం కావడం లేదు. ఎన్ని అవమానాలెదురైనా నేను మిమ్మల్ని విడిచి వుండలేను"

"ఏమిటో మీరీవాళ చిత్రంగా మాటాడుతున్నారు. స్నేహంలోని గొప్పదనం మావొదినలకి అర్థంకాదు. అది వాళ్ళ ఖర్మం. దానికి మనవేం చేయగలం?"

అతను నామాట వినిపించుకున్నట్టులేదు. ఇందాకటి ధోరణిలోనే మాటలు ప్రారంభించేడు.

"అందుచేత నేనో నిర్ణయానికొచ్చేసేను. ఏమైనాసరే, మిమ్మల్ని విడిచి నేనోక్షణం గూడా వుండలేనింక. కనుక... అంతే... అవునదే మంచిది. మనిద్దరం పెళ్ళిచేసుకుందాం అరుణగారూ! నన్ను చెప్పనివ్వండి మరి. నామాటకి అడ్డు రాకండి. మీ ఆస్తికోసం నేనీప్లాను వేయలేదు. నే నంత దుర్మార్గుణ్ణికాదు. నేనీమాటలు త్రికరణశుద్ధిగా చెబుతున్నాను. నేను ఉద్యోగిని కొంచెమైనా గొప్ప సంపాదనపరుణ్ణి. మిమ్మల్ని... మీ కే లోటు రాకుండా నేను శ్రమిస్తాను. అలా

అని హామీ ఇస్తున్నాను. అంతేగాని. ఇలా రోజూ మీ యింటికొచ్చి మిమ్మల్ని కలుసుకుని వెళ్ళిపోవడంలో సుఖం లేదు. ఇది మీ వాళ్ళకి గిట్టదు. అనుక్షణం మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను అరుణగారూ! మనం పెళ్ళి చేసుకుందాం, నేనీ మాట తొందరపడికానీ, ఆలోచన లేకుండాగానీ అనడం లేదు ఎన్నో రోజులు మరెన్నో గంట లాలోచించి ఈ నిర్ణయాని కొచ్చేను. ఏవంటారు అరుణా?"

అతనైతే నన్ను సులువుగా అడిగేడేగాని, నేనేం సమాధానం చెప్పేది. ఇంతమంచి స్నేహితుడు, నిజానికి తొందరపడి, ఈ నిర్ణయానికొచ్చి వుండడు. అతన్ని నొప్పించేదా?

"అయ్యో శేషగిరిగారూ! మీతో నేను చేసింది స్నేహమేనండి బాబూ, మా ఇంట్లో అన్నలూ, వొదినల దగ్గర్నుంచి నాకు లభించని స్నేహం మీ యింట్లో మీనుంచి లభించింది. గనక మనం మంచి స్నేహితులమైపోయాం. అయ్యో ఇప్పుడిదేం కోరికండీ! పెళ్ళా? మన పెళ్ళా? పెళ్ళనేది వేళాకోళం కాదండి బాబు! నేనంత ఎత్తు ఎదగలేదింక. నాకిప్పుడు కావలసింది స్నేహమే. కేవలం స్నేహం. ఏం, మీకు విడ్డూరంగా వుందా? నాకలా అనిపించడం లేదు మరి. క్షమించండి శేషగిరిగారూ! పెళ్ళనేమాట మనమధ్య తీసుకురాకండి. ఆ భావాన్ని దూరం చేసుకుని స్నేహితుడిగానే సరిపడండి. లేదూ... నాకో మంచి స్నేహితుడు గూడా దూరమయ్యాడనుకుంటాను. దేవుళ్ళాటివాడి సె పోగొట్టుకున్న దాన్ని, స్నేహం చెడిపోతే బాధపడతానా? వెళ్ళిపోండి సార్. వెళ్ళి

పోండి" ఇంత చెప్పాలనుకున్నదాన్ని అతని మొహంలో తాండవించే అమాయకత్వాన్ని చూడటంవల్ల, కేవలం తాత్పర్యమే చెప్పగలిగేను.

"పెళ్ళి గురించి నేనేం ఆలోచించలేదింక. మీకు పెళ్ళే ముఖ్యమైతే, ప్రస్తుతానికి శెలవు. నాకు పెళ్ళవసరమైనప్పుడు ఆ తంతుకి మీరే కావాలనుకున్నప్పుడు ఖబురంపుతాను. కదూ...ఇంకేం చెప్పగలను శేషగిరిగారూ!"

శేషగిరి లేచి వెళ్ళిపోతున్నప్పుడు అతనిమీద నాకు జాలి కలిగింది. అతనటు వెళ్ళేడు. ఇటు చిన్నోదిన నా గదిలో కొచ్చి నాతో ఏదో చెప్ప ప్రయత్నించింది. కానీ;

నా కావిడ మాటలు రుచించవనే అభిప్రాయానికి నే నెప్పుడో వొచ్చేసేను. గనక నే నక్కడ్నుంచి లేచి ఆంటీని పిలుస్తూ ఆ గదిని దాటేను.

దేవుడేం చేయదలిచేడోగాని, సిరిగలతల్లి అరుణమ్మ కొన్ని చిత్రమైన కష్టాల్లో పెరుగుతూనే వుంది పాపం!

రచయిత.

— జ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక నుంచి